
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విజయనగరం
జిల్లా వార్తలు
బుధవారం 5 నవంబరు 2025





రాత్రి గస్తీని ముమ్మరం చేయాలి

7లో

- అనుమానితుల వేలిముద్రలు సేకరించాలి
- అవాస్తవాలు ప్రచారం చేస్తే కేసులు
- నేర సమీక్షలో ఎస్పీ దామోదర్

పౌర్ణమి శోభ

- కేదారేశ్వరుని పూజకు సిద్ధం
- కిటకిటలాడిన మార్కెట్


కార్తీకమాసంలో ముఖ్యమైన రోజుగా భక్తులు భావించే పౌర్ణమికి వేళ అయింది. బుధవారం సాయంత్రం కుటుంబ సమేతంగా కేదారేశ్వరుని వ్రతం ఆచరించేందుకు భక్తులంతా సిద్ధమయ్యారు. అంతకుముందు శివాలయాల్లో అభిషేకాలు, కార్తీక దీపారాధన చేయనున్నారు. ఇదే రోజు ప్రముఖ ఆలయాల్లో జ్వాలాతోరణం కూడా జరుగనుంది. ఇప్పటికే శివాలయాన్నీ కొత్త శోభను సంతరించుకున్నాయి. విద్యుత్ దీపాలతో సుందరంగా ముస్తాబయ్యాయి. కాగా పౌర్ణమి పూజల కోసం సామగ్రి కొనుగోలుకు క్యూ కట్టడంతో మంగళవారం మార్కెట్ కిటకిటలాడింది. నెల్లిమర్ల, పుణ్యగిరి, ధర్మవరం, సంగాం ఆలయాల్లో పెద్ద ఎత్తున పూజలు, అభిషేకాలు జరుగనున్నాయి.



శివ పూజకు వేళాయే! 6



పైడిమాంబ ఆలయం వద్ద భారీ అన్నదానం 7లో



టెట్‌పై అయోమయం

- రెండేళ్లలో ఉపాధ్యాయులకు టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి అన్న సుప్రీంకోర్టు
- మినహాయించాలని ప్రభుత్వానికి సంఘాల విన్నపాలు
- రివ్యూ పిటిషన్ వేయాలనుకుంటున్న ప్రభుత్వం
- తుది తీర్పుపైనే ఉపాధ్యాయుల భవితవ్యం



నెల్లిమర్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి):

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)పై ఇన్ సర్వీసు టీచర్లలో అయోమయం నెలకొంది. ఈ విషయంపై వారు ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. టెట్ లేని వారంతా రెండేళ్లలో టెట్ ఉత్తీర్ణత సాధించాలని ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పాఠశాల విద్యాశాఖ జారీ చేసిన టెట్ నోటిఫికేషన్‌లోనూ ఈ విషయం పేర్కొంది. అయితే ఉపాధ్యాయ సంఘాల కోరిక మేరకు టెట్ మినహాయింపు కోసం రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో రివ్యూ పిటీషన్ వేసేందుకు సిద్ధమవుతోంది. న్యాయస్థానం తుది తీర్పుపైనే టీచర్ల 'టెట్' భవితవ్యం ఆధారపడి ఉంటుంది.

టెట్ అనేది ఉపాధ్యాయ నియామకాలకు అర్హత పరీక్ష. టెట్ పరీక్ష ఆంధ్రప్రదేశ్‌లో 2011 నుంచి అమల్లోకి వచ్చింది. 2011కు పూర్వం జరిగిన ఉపాధ్యాయ నియామకాల్లో టెట్ ప్రక్రియ లేదు. ప్రస్తుతం సర్వీసులో కొనసాగుతున్న వారిలో ప్రధానంగా 1989, 1995,1996,1998, 2000,2002, 2005, 2008 డీఎస్‌సీ నియామకాల్లో ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు టెట్ లేకుండానే ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారు. వీరందరూ టెట్ పాస్ కావాల్సిందేనని సుప్రీం కోర్టు, ఎన్‌సీటీఈ (నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్) తాజాగా షరతు విధించింది. అయితే వీరిలో 5 సంవత్సరాలు కన్నా తక్కువ సర్వీసు ఉన్న వారికి టెట్ అర్హత అవసరం లేదని సడలింపు ఇచ్చింది.

2012, 2014, 2018 డీఎస్‌సీ నోటిఫికేషన్‌లతో పాటు తాజాగా జరిగిన మెగా డీఎస్‌సి 2025లో ఉపాధ్యాయులుగా ఎంపికయిన వారు టెట్ అర్హతతోనే డీఎస్‌సీ పరీక్షకు హాజరైనందున వీరు మళ్లీ టెట్ రాయాల్సిన పనిలేదు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం అటు ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ యాజమాన్యాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరూ రెండేళ్లలో టెట్ పాస్ కావాల్సినందేనని సుప్రీం కోర్టుతో పాటు ఎన్‌సీటీఈ నొక్కి చెప్పడంతో వారంతా టెట్ రాయడం విధిగా మారింది. కాగా టెట్ నోటిఫికేషన్ జారీ కావడంతో వారంతా దరఖాస్తు చేసుకునేందుకు అయిష్టంగానే సన్నద్ధమవుతున్నారు. విజయనగరం ఉమ్మడి జిల్లాలో ఈ పరీక్షకు హాజరేయ్యే ఉపాధ్యాయుల సంఖ్య సుమారు 10 వేల నుంచి 12 వేల మంది వరకు ఉంటుందని అంచనా..

టీచర్లకు సవాల్..

2011కు ముందు టీచర్లకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఓ సవాల్‌గా మారింది. ఎందుకంటే టెట్ 150 మార్కులకు ఉంటుంది. ఇందులో పిల్లల అభివృద్ధి, బోధనాశాస్త్రం 30 మార్కులు, మాతృ భాష 30, ఇంగ్లిషు 30 (మిగతా 6వ పేజీలో..)

కలకలం

వైసీపీ నేత గోదాంలో అక్రమంగా పురుగుమందులు

- వాటి విలువ రూ.55లక్షలు
- పక్కా సమాచారంతో తనిఖీకి వెళ్లిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు
- రాత్రి వరకు సోదాలు, రికార్డుల పరిశీలన



రాత్రి 7 గంటల సమయంలో విచారిస్తున్న అధికారులు

జామి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అలమండ గ్రామంలో వైసీపీ నేత, ఉపసర్పంచ్ లగుడు దేవుడుకు చెందిన మామిడి గోదాంలో భారీ ఎత్తున అక్రమంగా నిల్వ ఉంచిన పురుగుమందులు, పౌడర్లను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సింహాచలం, ఏవో పూర్ణిమ గుర్తించారు. పక్కా సమాచారంతో తనిఖీకి వెళ్లిన వారు అక్కడ 3550 లీటర్ల పురుగు మందుల ద్రావణం, 2085 కేజీల పౌడర్‌ను గుర్తించారు.

వీటివిలువ ఎంఆర్‌పీ ప్రకారం రూ.55 లక్షలుగా పేర్కొన్నారు. గడిచిన కొద్ది సంవత్సరాలుగా ఈ వ్యాపారం పెద్దఎత్తున సాగుతోందని ఎస్పీకి ఫిర్యాదు అందింది. ఆ మేరకు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది కలిసి మంగళవారం మధ్యాహ్నం రెండుగంటలకు అలమండ గ్రామానికి చేరుకున్నారు. అనంతరం వైసీపీనేతకు చెందిన గోదాంకు వెళ్లారు. లోపల పురుగుమందుల డబ్బాలు, పౌడర్ ప్యాకెట్లు గుర్తించారు. నిల్వల పరిశీలనతో పాటు రికార్డులను రాత్రి ఏడువరకు పరిశీలించారు. అనంతరం ఏవో మాట్లాడుతూ గతనెల అక్టోబర్‌లో వీటిని ఢిల్లీనుంచి పెద్దఎత్తున తెచ్చి నిల్వచేసినట్లు గుర్తించామన్నారు. ఇది 1968 చట్టప్రకారం నేరమని, కేసు నమోదు చేసి గోదాం సీజ్ చేస్తామన్నారు.



అనుమతి లేకుండా పురుగు మందులు ఉంచిన గోదాం ఇదే

గోదాం వద్దకు చేరుకున్న అనుచరులు..

అధికారులు తనిఖీలు చేసి రికార్డులు స్వాధీనం చేసుకున్న విషయం తెలుసుకున్న వైసీపీ నేత అనుచరులు అక్కడకు చేరుకున్నారు. ఇవి అమ్మడానికి కాదని, 'మా దేవుడు సార్ మా అందరి కోసం తెప్పించి, మా మామిడిపంటలకు పిచికారీ చేసుకోవడానికి ఇస్తారని, వీటిని అరువు తీసుకొని తమ పంట అమ్ముకున్నాక డబ్బులు ఇస్తామని' చెప్పారు. ఇదే విషయంపై ఆ (మిగతా 8వ పేజీలో..)

భోగాపురంలో భూ ప్రకంపనలు

ఆందోళన చెందిన స్థానికులు

భోగాపురం, నవంబరు4(ఆంధ్రజ్యోతి): భోగాపురంలో మంగళవారం వేకువజామున కొన్ని సెకన్ల పాటు భూమి కంపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సుమారు 4.20 గంటల సమయంలో మంచం కదిలినట్లు, ఇంట్లో సామగ్రి కాస్త జరిగినట్లు అనిపించడంతో పాటు పెద్ద శబ్దం రావడంతో కొందరు బయటకు వచ్చి చూశారు. ఉదయం సామాజిక మాధ్యమాల్లో విశాఖ, భీమిలి తదితర ప్రాంతాల్లో భూకంపం వచ్చిందని ప్రచారం కావడంతో అయితే ఇక్కడ కూడా భూకంపం వచ్చినట్లు స్థానికులు నిర్ధారించుకొన్నారు. గంట్యాడలో కూడా భూమి కంపించినట్లు చెప్పుకుంటున్నారు. ఇదే విషయమై ఆంధ్రయూనివర్సిటీ జియో ఫిజిక్స్ ప్రొఫెసర్ త్రినాథరావు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల కేంద్రంగా ఏర్పడ్డ భూకంప తీవ్రత చాలా స్వల్పమైనదని, సెస్మిక్ తరంగాల ప్రకారం దీని తీవ్రత 3.7 అని, ఎవరూ భయపడనవసరం లేదని, విశాఖ (స్టేజ్2లో) సేఫ్‌జోన్‌లో ఉందని అన్నారు.

ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్రకే కేంద్ర బిందువు

- ఈఏడాది చివరిలో ట్రయల్ విమానం ఎగిరే అవకాశం
- కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు



పనులపై ఆరా తీస్తున్న కేంద్ర మంత్రి

భోగాపురం, నవంబరు4(ఆంధ్రజ్యోతి): భోగాపురంలో నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఉత్తరాంధ్రకే కేంద్ర బిందువు కానుందని పౌరవిమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. విమానాశ్రయ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఎప్పటిలోగా పూర్తి అవుతుందో అధికారులను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇక నుంచి ఈ ప్రాంతంలో ఏ అభివృద్ధి జరిగినా ఎయిర్‌పోర్టును దృష్టిలో పెట్టుకొని పనులు సాగుతాయన్నారు. ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని సీఎం చాలెంజ్‌గా తీసుకొన్నారని, ఎన్ని సమస్యలు ఎదురైనా సకాలంలో (మిగతా 8వ పేజీలో..)

కేసులు రాజీ అయ్యేలా ప్రయత్నించండి

- జిల్లా న్యాయాధికారి బబిత



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి బబిత

విజయనగరం క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విజయనగరం జిల్లాలో డిసెంబరు 13న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా ప్రయత్నించాలని జిల్లా న్యాయాధికారి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఎం.బబిత సూచించారు. ఉమ్మడి విజయనగరం జిల్లా న్యాయాధికారులతో మంగళవారం ఆమె మాట్లాడారు. రాజీకి అవకాశం ఉన్న క్రిమినల్ కేసులు, మోటారు ప్రమాద బీమా, బ్యాంకులు, చెక్ బౌన్స్ ప్రాంసరీ నోట్ కేసులు, పర్మినెంట్ ఇంజక్షన్ దావాలు, ఎక్సైజ్ కేసులు, కుటుంబ తగాదాలు, ల్యాండ్, మున్సిపాలిటీ కేసులకు ఇరుపార్టీల అనుమతితో రాజీమార్గంలో శాశ్వత పరిష్కారం చూపించాలన్నారు. అన్నిశాఖల అధికారులతో చర్చించి త్వరితగతిన కేసులు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో న్యాయాధికారులు ఎం.మీనాదేవి, కె.విజయకళ్యాణి, బి.అప్పలస్వామి, ఎం.పద్మావతి, కె.నాగమణి, శాశ్వత లోక్‌అదాలత్ చైర్మన్ దుర్గయ్య, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు సిద్ధంగా ఉండాలి

- ఖరీఫ్‌లో 4 లక్షలు మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం
- సాధారణ రకం రూ.2369, గ్రేడ్ ఏ రకం రూ.2389
- జిల్లాలో 382 కొనుగోలు కేంద్రాలు
- జిల్లా, మండల స్థాయిల్లో కంట్రోల్ రూం ఏర్పాటు
- జేసీ సేతుమాధవన్

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో ధాన్యం సేకరణకు యంత్రాంగమంతా సిద్ధంగా ఉండాలని జేసీ సేతుమాధవన్ ఆదేశించారు. ఈ ఏడాది 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు లక్ష్యంగా నిర్ణయించామని తెలిపారు. కనీస మద్దతు ధర సాధరణ రకం రూ.2369, గ్రేడ్ ఏ రూ.2389గా ఉంటుందని, ఇది గత ఏడాది కంటే రూ.69 ఎక్కువని తెలియజేశారు. ధాన్యం సేకరణపై కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం అధికారులు, సిబ్బందికి శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ధాన్యం సేకరణకు జిల్లాలో 382 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, 261 క్లస్టర్లను ఏటీసీలుగా (మిగతా 8వ పేజీలో..)



మాట్లాడుతున్న జేసీ సేతు మాధవన్

రూ.55 కోట్లతో 109 చెరువుల అభివృద్ధి

- కలెక్టర్ రామసుందర్ రెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ రామసుందర్ రెడ్డి

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): విజయనగరం ఇరిగేషన్ డివిజన్ పరిధిలో 109 చెరువులను సుమారు రూ.55 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు కలెక్టర్ రామసుందర్ రెడ్డి తెలిపారు. చిన్నతరహా నీటి పారుదల వనరులైన చెరువుల అభివృద్ధిపై తన చాంబర్‌లో అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆర్‌ఆర్‌ఆర్(రిపేర్స్, రీస్టోరేషన్, రీఇన్నోవేషన్) కింద డివిజన్‌లో మొదటి విడతలో 44, రెండో విడతలో 49, తాజాగా మూడో విడతలో 16 చెరువులు ప్రతిపాదించినట్లు తెలిపారు. మొత్తం ఐదు నియోజకవర్గాల్లోని 19 మండలాల్లో ఈ చెరువులను అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. చెరువుల అభివృద్ధికి అనుమతి రాగానే ఈ పనులు ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఈ అప్పలనాయుడు, ఈఈ వెంకటరమణ, గ్రామీణ మంచినీటి సరఫరా పథకం ఎస్ఈ కవిత, డ్వామా పీడీ శారదదేవి పాల్గొన్నారు.

శివ పూజకు వేళాయె

- నేడు కార్తీక పౌర్ణమి
- హిందువులకు విశిష్టమైన పర్వదినం
- ఆలయాల్లో పూజలు, నదుల్లో దీపారాధన
- శివకేశవులకు ప్రీతికరమైన రోజు



విజయనగరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి):

హిందువులు అత్యంత పవిత్రంగా భావించే పండుగల లో కార్తీక పౌర్ణమి ఒకటి. కార్తీక మాసం శివకేశవులకు ప్రీతికరమైనదిగా పండితులు చెబుతారు. ఈ మాసంలో వచ్చే పండుగల్లో అత్యంత వైభవంగా జరుపుకునేది కార్తీక పౌర్ణమి. కార్తీక పౌర్ణమిని త్రిపుర పూర్ణిమ అని కూడా అంటారు. త్రిపురాసులు అనే రాక్షసులు నిర్మించిన మూడు కొత్త గ్రహాలను (త్రిపురాలు) శివుడు ఒకేసారి తన త్రిశూలంతో అంతమొందించిన రోజుగా చెబుతారు. అందుకు త్రిపుర పూర్ణిమ అని పిలుస్తారు. విజయానికి సంకేతంగా అనేక ప్రదేశాల్లో ఉత్సవాలు నిర్వహిస్తారు

మానవాళిని రక్షించిన రోజుగా..

శ్రీ మహావిష్ణువు మత్స్యావతారంలో మానవాళిని, వేదాలను ప్రళయం నుంచి రక్షించిన రోజు కూడా ఇదేనని నమ్మకం. ఈ పవిత్రమైన రోజున సకల దేవతలు భూమిపైకి వస్తారని... ఈ రోజు చేసే స్నానాలు, దానధర్మాల వల్ల సకల పాపాలు హరించి.. మోక్షం లభిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

● కార్తీక పౌర్ణమి సందర్భంగా సముద్రం, నదులు, లేదా పవిత్ర జలాల్లో స్నానం చేయడం అత్యంత పుణ్యప్రదం. ఇది మహాశివరాత్రితో సమానమైన ఫలితాన్ని ఇస్తుందని భక్తుల విశ్వాసం.

దీపారాధన..

కార్తీక మాసంలోనూ.. అందులోనూ కార్తీక పౌర్ణమి రోజున దీపారాధనకు విశేష ప్రాధాన్యం ఉంది. ఈ ఒక్కరోజు 365 వత్తులతో కూడిన దీపాన్ని వెలిగిస్తారు. ఇది సంవత్సరంలో ప్రతి రోజూ దీపం వెలిగించిన పుణ్యాన్ని ఇస్తుందని విశ్వాసం. అరటి పువ్వులు, దొన్నెలలో దీపాలను వెలగించి.. నదులు, చెరువుల్లో వదులు తారు. దీని వల్ల అష్టైశ్వర్యాలు కలుగుతాయని నమ్మకం. ఉసిరి చెట్టు వద్ద, లేదా శివాలయంలో దీపాలను వెలిగించడం శుభప్రదమని పండితులు చెబుతారు.

> 'కార్తీక మాసంతో సమానమైన మాసం లేదు' అని పురాణాలు చెబుతున్నాయి. అటువంటి కార్తీక మాసంలో వచ్చే పౌర్ణమికీ అంతే ప్రాధాన్యం ఉంది. ఆ రోజున హిందువులు కేదారేశ్వర వ్రతాలు ఆచరిస్తారు. శివాలయాల్లోనూ ప్రత్యేక పూజలు చేస్తారు. ఈ మేరకు శైవక్షేత్రాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు.

జ్వాలా తోరణం..

కార్తీక పౌర్ణమి రోజున శివాలయాల్లో జ్వాలా తోరణం కింద నడవడం ద్వారా సర్వపాపాలు తొలగి నరక ద్వారం నుంచి విముక్తి లభిస్తుందని భక్తుల విశ్వాసం. అలాగే కేదారేశ్వర వ్రతం, సత్యనారాయణ స్వామి వ్రతాలు చేస్తారు. భక్తులు ఉపవాస దీక్షతో ఉంటూ...శివకేశవులను పూజిస్తారు. విజయనగరం లోని శివాలయం వీధిలోని ఉమారామలింగేశ్వర స్వామి ఆలయం, కోట వద్ద వీర రాజేశ్వర, దాసన్నపేటలోని ఉమారామలింగేశ్వర, బాబామెట్టలోని శివ పంచాయతన, రింగురోడ్డులోని పశుపతినాథేశ్వర స్వామి ఆలయాల వద్ద ప్రత్యేకంగా జ్వాలాతోరణాలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

సిద్ధమైన ఆలయాలు..

పౌర్ణమి నేపథ్యంలో జిల్లాలోని శివాలయాలన్నీ కొత్త శోభను సంతరించుకున్నాయి. ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. కార్తీక పౌర్ణమి రోజు ఎవరికి వారు పూజలు చేయడంతో పాటు.. ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు చేస్తుంటారు. విజయనగరం, నెల్లిమర్ల, గుర్ల, చీపురుపల్లి, దత్తిరాజేరు, గంట్యాడ, గజపతినగరం, రాజాం, సంతకవిటి, రేగిడి మండలాల పరిధిలో ఉన్న ఆలయాలన్నిటిలోనూ కార్తీక పౌర్ణమి పూజలకు సిద్ధం చేశారు. నెల్లిమర్లలోని రామతీర్థం దేవస్థానం.. ఆలయం పక్కన ఉన్న శివాలయం, పుణ్యగిరి, ధర్మవరం సన్యాసయ్య, సంగమేశ్వర ఆలయాల్లో ప్రత్యేకంగా దీపారాధన చేయనున్నారు.

మార్కెట్లు కిటకిట..

పౌర్ణమి పూజల కోసం సామగ్రి కొనుగోలు చేసేవారితో మంగళవారం విజయనగరంలోని మార్కెట్లు కిటకిటలాడాయి. ఉమ్మడి జిల్లాలోని బొబ్బిలి, సాలూరు, పార్వతీపురం ప్రాంతాల్లో మార్కెట్లు కొనుగోలుదారులతో కిక్కిరిశాయి.



పండ్లు కొనుగోలు చేస్తున్న భక్తులు



పౌర్ణమి సామగ్రి కొనుగోలుదారులతో రద్దీగా ఉన్న విజయనగరంలోని మార్కెట్



పూజ కోసం పత్రిని కొనుగోలు చేస్తూ..



నాగూరు సమీపంలో సంచరిస్తున్న గజరాజుల గుంపు

నాగూరు రహదారిపై ఏనుగులు

గరుగుబిల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగూరు ప్రధాన రహదారి, పరిసర ప్రాంతాల్లో గజరాజుల గుంపు సంచరిస్తుండడంతో ఆ ప్రాంతీయులు భయాందోళన చెందుతున్నారు. గత మూడు రోజులుగా నాగూరు, సంతోషపురం, ఖడ్గవలస, పిట్టలమెట్ట ప్రాంతాల్లో ఏనుగులు సంచరిస్తున్నాయి. మంగళవారం పిట్టలమెట్ట నుంచి ప్రధాన రహదారితో పాటు బస్టాండ్ ప్రాంతానికి చేరుకోవడంతో గ్రామస్థులు ఆందోళనకు గురయ్యారు. దీంతో అటవీ శాఖ సిబ్బంది, ట్రాకర్లు రహదారిని ఆనుకొని ఉన్న తోటల్లోకి ఏనుగులను మళ్లించారు. ఏ సమయంలో అవి రహదారిపైకి వస్తాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి గజరాజుల గుంపును సుంకి ప్రాంతానికి తరలించే చర్యలు చేపట్టాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు. ఏనుగుల భయంతో వరి పంట కోత కోయలేని పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు.

జాతీయ స్థాయిలో సత్తా చాటాలి

● ఎమ్మెల్యే విజయచంద్ర



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

బెలగాం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో యువత తమ సత్తాను చాటి జాతీయ స్థాయిలో జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. స్థానిక జీజీ కళాశాల ఆడిటోరియంలో మంగళవారం జిల్లా యువజన శాఖ, సెట్విజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా స్వామి వివేకనంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుత విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఢిల్లీకి స్థాయికి వెళితే తన సొంత నిధులతో వారికి విమాన ప్రయాణ ఖర్చులు, వసతి సౌకర్యం కల్పిస్తానని ప్రకటించారు. యువత తమ నైపుణ్యాకి పదునుపెట్టి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి ఎన్నో కంపెనీలను తెచ్చి యువతకు ఉద్యోగవకాశాలు కల్పనే ధ్యేయంగా పని చేస్తున్నారని చెప్పారు. వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థుల జానపద నృత్యాలను తిలకించి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఐఈవో వై.నాగేశ్వరరావు, జీజీ కళాశాల ప్రిన్సిపాల్ టి.విశైలజ, అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



జానపద నృత్యం చేస్తున్న విద్యార్థినులు

జిల్లా స్థాయి పోటీల్లో విజేతలు వీరే..

పార్వతీపురంలో జరిగిన యువజనోత్సవాల్లో భాగంగా వివిధ విభాగాల్లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. జానపద నృత్యాల్లో (గ్రూప్) సాలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రథమ స్థానం, బలిజిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ద్వితీయ స్థానం సాధించాయి. జానపద గీతాలు (గ్రూప్)లో మక్కువకు చెందిన డి.దీపిక బృందం ప్రథమ స్థానం, గరుగుబిల్లికి చెందిన ఆర్.ప్రమోదిని బృందం ద్వితీయ స్థానం సంపాదించాయి. కవితల పోటీల్లో గరుగుబిల్లికి చెందిన కె.స్నేహ ప్రథమ స్థానం, జి.ప్రియాంక ద్వితీయ స్థానం పొందారు. కథారచనలో గుమ్మలక్ష్మీపురానికి చెందిన చెందిన టి.సిరివెన్నెల ప్రథమ స్థానం, చినమేరంగికి చెందిన పి.లహరి ద్వితీయ స్థానం పొందారు. పెయింటింగ్‌లో సాలూరుకు చెందిన కె.అక్షర లహరి ప్రథమ స్థానం, కొమరాడకు చెందిన సీహెచ్.మీనాక్షి ద్వితీయ స్థానం పొందారు. ప్రకటనల్లో చినమేరంగికి చెందిన పి.లహరి ప్రథమ స్థానం, మక్కువకు చెందిన డి.దీపిక ద్వితీయ స్థానం పొందారు. సైన్స్ అండ్ టెక్నాలజీ(గ్రూప్)లో జోగింపేటకు చెందిన ఆర్.సంతోష్ కుమార్ ప్రథమ స్థానం, గరుగుబిల్లికి చెందిన ఆర్.పూజిత ద్వితీయ స్థానం సాధించారు.

పైడితల్లికి ప్రత్యేక పూజలు



అమ్మవారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

విజయనగరం రూరల్/ కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, సిరుల తల్లి పైడిమాంబ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం పైడిమాంబకు అత్యంత ప్రీతి పాత్రమైన రోజు. దీంతో దేవస్థానం అర్చకులు అమ్మవారికి పంచామృతాభిషేకం, విశిష్ట అర్చ నలు చేశారు. కార్తీకమాసం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భవానీ భక్తులు, అయ్యప్పస్వామి భక్తులు, శివ భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకు న్నారు. పైడితల్లికి వివిధ రకాల పువ్వు లతో ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ రకాల పిండివంటలను ప్రసాదంగా నివేదించారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి గజపతి రాజు, ఎమ్మెల్సీ గాదే శ్రీనివాసుల నాయుడు మంగళవారం అమ్మవారిని దర్శించుకున్నారు.



పైడితల్లి ఆలయంలో ఉన్న భక్తులు

రోడ్డుపై కూరుకుపోయిన లారీలు

● స్తంభించిన ట్రాఫిక్ ● గంటల తరబడి నిలిచిన వాహనాలు

బొబ్బిలి రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి-తెర్లాం రోడ్డులో మంగళవారం ఉదయం రెండు లారీలు కూరుకుపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. తుఫాన్ ప్రభావం.. వరదలకు పారాది వద్ద వేగావతి నదిపై తాత్కాలికంగా నిర్మించిన కాజ్‌వే మునిగిపోయిన సంగతి తెలిసిందే. దీంతో భారీ వాహనాలను బొబ్బిలి నుంచి తెర్లాం వైపు మళ్లించారు. అలజంగి - కారాడ వద్ద రోడ్డు మర్మతులు పనులు చేస్తున్నారు. వర్షాలకు రోడ్లు బురద, గోతుల మయం కావడంతో కారాడ గ్రామం వద్ద భారీ లోడులతో వెళ్తున్న లారీలు నిత్యం బురదలో కూరుకుపోతున్నాయి. ఈ క్రమంలోనే మంగళవారం బొబ్బిలి- తెర్లాం రోడ్డులో రెండు లారీలు కూరుకుపోయాయి. లారీలు రోడ్డు మధ్యలో ఉండిపోవడంతో అలజంగి నుంచి రేజేరు వరకు ట్రాఫిక్ స్తంభించింది. గంటల తరబడి వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందుకున్న ఎస్ఐ జ్ఞాన ప్రసాద్ సిబ్బందితో వెళ్లి వాహనాల రాకపోకలకు వీలు కల్పించారు. తరచూ ఇదే సమస్య ఎదురవుతోందని... శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.





లారీలను క్రేన్‌తో బయటకు తీస్తున్న దృశ్యం

గ్యాస్ ప్రమాదానికీ ఉంది బీమా

● గరిష్ఠంగా రూ.30 లక్షలు చెల్లించే అవకాశం
● నిబంధనల మేరకే నష్ట పరిహారం



రాజాం రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ లేని ఇల్లు ఉండదంటే అతిశయోక్తి కాదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న రాయితీలు, సూపర్‌సిక్స్ పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అర్హత కలిగిన గ్యాస్ వినియోగదారుల కు ఏడాదికి ఉచితంగా అందిస్తున్న మూడు సిలిండర్ల పథకం పుణ్యమా అని దాదాపుగా ప్రతి ఇంటా గ్యాస్ వినియోగిస్తున్నారు. అదే సమయంలో గ్యాస్ సిలిండర్ పేలడం, ఇతరత్రా లోపాల వల్ల గానీ ఆస్తి, ప్రాణనష్టం సంభవిస్తే నష్టపోయిన వినియోగ దారులకు ప్రమాద బీమా అందించేందుకు గ్యాస్ కంపెనీలు తగు చర్యలు తీసుకుంటున్నాయి. ప్రమాదం జరిగితే నియమ నిబంధనలకు లోబడి నష్ట నివారణకు వీలుగా గ్యాస్ కంపెనీలు బీమా కంపెనీలకు సాయానికి సిఫారసు చేస్తాయి.

● పరిహారం ఇలా..

గ్యాస్ సిలిండర్ పేలిపోవడం, గ్యాస్ లీకై ప్రాణ, ఆస్తినష్టం సంభవిస్తే రూ.2 లక్షలు బీమా వర్తిస్తుంది. గ్యాస్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతే రూ.6 లక్షలు పరిహారంగా పొందవచ్చును. ప్రమాదం బారినపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఒక్కో సభ్యుడికి రూ.2 లక్షలు, తక్షణ సాయం కింద రూ.25 వేల వంతున బీమా కంపెనీలు పబ్లిక్ లయబులిటీ బీమా పాలసీ ద్వారా చెల్లిస్తాయి. కుటుంబం మొత్తానికి రూ.30 లక్షల వరకూ బీమా పరిహారం పొందేందుకు అవకాశాలు ఉన్నాయి.

నిబంధనలు ఇలా...

● గ్యాస్ కనెక్షన్ తీసుకున్న సమయంలో గ్యాస్ ఏజెన్సీకి వినియోగదారులు ఇచ్చిన చిరునామాలో ప్రమాదం సంభవిస్తే బీమా ప్రీమియం వర్తిస్తుంది. అలాకాకుండా గ్యాస్‌బుక్‌లో ఓ చిరునామా, ప్రమాదం జరిగిన ప్రాంతం మరో చిరునామాలో ఉంటే ప్రమాద బీమా వర్తించదు.

● ఏడాదికోమారు గ్యాస్ కనెక్షన్‌ను ప్రతి వినియోగదారుడు సంబంధిత గ్యాస్ ఏజెన్సీకి చెందిన మెకానిక్‌తో సొంత ఖర్చులతో స్టవ్, కనెక్షన్‌ను చెక్ చేయించుకుని సంబంధిత రిజిస్టర్‌లో నమోదు చేయించుకోవాలి. ఈ పద్ధతి అనుసరించకపోతే పరిహారం పొందేందుకు వీలుండదు.

● రెండేళ్లకోమారు ఖచ్చితంగా సురక్ష ట్యూబ్‌ను గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులతో మార్పించుకోవాలి. అలాకాకుండా మార్కెట్‌లో లభ్యమైన ట్యూబ్‌లను వినియోగించి... ప్రమాదం సంభవిస్తే పరిహారానికి అనర్హులవుతారు..

వినియోగదారులు ఏం చేయాలంటే..

● విద్య, వైద్యం, ఉద్యోగం, ఇతరత్రా అవసరాల కోసం ఇళ్లు మారాల్సి వస్తే ఖచ్చితంగా కొత్తగా నివాసం ఏర్పరచుకున్న ఇంటి చిరునామాను గ్యాస్ ఏజెన్సీలో నమోదు చేయించుకోవాలి.

● ఏడాదికోమారు సొంత ఖర్చులతో గ్యాస్ ఏజెన్సీకి చెందిన మెకానిక్‌తో గ్యాస్ కనెక్షన్‌ను చెక్ చేయించుకోవాలి.

● గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు సిఫారసు చేసిన సురక్ష ట్యూబ్‌ను ఏజెన్సీలోనే కొనుగోలు చేసి వాడాల్సి ఉంటుంది.

ప్రమాదం సంభవిస్తే..

గ్యాస్ లీక్, సిలిండర్ పేలడం వంటి కారణాలతో ప్రమాదం సంభవించి ప్రాణ, ఆస్తినష్టం జరిగితే ఖచ్చితమైన ఆదారాలతో గ్యాస్ కనెక్షన్ తీసుకున్న ఏజెన్సీకి సకాలంలో సమాచారం అందించాల్సి ఉంటుంది.

● ఈ వివరాలతో గ్యాస్ ఏజెన్సీ డిస్ట్రిబ్యూటర్ సంబంధిత కంపెనీకి, బీమా సంస్థ ప్రతినిధులకు సమాచారం అందిస్తారు.

● పరిహారం పొందేందుకు మరణ ధ్రువీకరణపత్రం, పోస్ట్‌మార్టం నివేదిక, మెడికల్ బిల్లులు ఇవ్వాల్సి ఉంటుంది. వీటితో సంబంధిత కంపెనీలు నిజనిర్ధారణకు వచ్చి... అర్హత మేరకు పరిహారం అందిస్తారు.

నిబంధనలు కచ్చితంగా పాటించాలి..

గ్యాస్ కంపెనీలు నిర్ధారించిన నియమ నిబంధనలను వినియోగదారులు పాటించాలి. చిరునామా మారితే వెంటనే సమాచారం ఇవ్వాలి. సురక్ష ట్యూబ్‌నే వాడాలి. గ్యాస్ కంపెనీ టెక్నీషియన్‌తో చెక్ చేయించుకోవాలి. గ్యాస్ వినియోగంలో ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు గ్యాస్ ఏజెన్సీకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలి. అన్నీ సక్రమంగా ఉండి గ్యాస్ ప్రమాదం సంభవించి, ఆస్తి, ప్రాణనష్టం జరి గితే పరిహారం కోసం కంపెనీలకు నివేదిస్తాం.

-కొత్తా సాయిప్రశాంత్ కుమార్,
గ్యాస్ ఏజెన్సీ డీలర్, రాజాం

రాత్రి గస్తీని ముమ్మరం చేయాలి

- అనుమానిత వ్యక్తుల వేలిముద్రలు సేకరించాలి
- సోషల్ మీడియాలో అవాస్తవాలు ప్రచారంచేస్తే కేసులు
- నేర సమీక్షలో ఎస్పీ దామోదర్

విజయనగరం క్రైం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో రాత్రి పూట గస్తీని ముమ్మరం చేయాలని, ముఖ్యమైన కూడళ్లల్లో ప్రత్యేక నిఘా పెట్టాలని ఎస్పీ ఎఆర్ దామోదర్ పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ మందిరంలో పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలు నియంత్రించడంలో హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తులు, పాత నేరస్థుల కదలికలపై నిఘా ప్రధానమన్నారు. రాత్రి సమయాల్లో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే, వారి వేలిముద్రలు సేకరించాలన్నారు. రౌడీ షీట్లు కలిగిన వ్యక్తులు, పాతనేరస్థుల ప్రస్తుత జీవన విధానాన్ని గమనిస్తూ ఉండాలని, కౌన్సెలింగ్ నిర్వహించే సమయంలో వారి పనితీరును గమనించాలన్నారు. సోషల్‌మీడియాలో అవాస్తవాలు ప్రచారంచేస్తే కేసులు నమోదు చేయాలని కోరారు. సమావేశంలో ఎఎస్పీ సౌమ్యలత,డీఎస్పీలు గోవిందరావు, భవ్యారెడ్డి, రాఘ వులు సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దామోదర్

వ్యాసరచన విజేతలకు బహుమతులు

జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలలు, కళాశాలలు, పోలీసుల పిల్లలు, పోలీసు ఉద్యోగులకు వేర్వేరుగా పోలీసు అమరవీరుల సంస్మరణవారోత్సవాల్లో భాగంగా వ్యాసరచన, వృక్తత్వ పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ప్రోత్సాహక నగదు బహుమతులను మం గళవారం ఎస్పీ ఏఆర్ దామోదర్ ఎస్పీ కార్యాలయంలో అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీసు సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా లైంగిక వేధింపుల నుంచి మహిళలు, పిల్లలను రక్షించడంలో విద్యార్థుల పాత్ర అన్న అంశంపై పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. నేటి పోలీసింగ్‌లో టెక్నా లజీ పాత్ర అన్న అంశంపై కూడా గతనెల 24న జిల్లా కేంద్రలో పోటీలు నిర్వహించామని తెలిపారు. ఈ పోటీల్లో హెచ్‌సీ దావె నాదరరావు, ఆర్ఎస్ఐ సూర్యనారాయణ, హెచ్‌సీ జనార్దన్‌రావు విజేతలుగా నిలిచారు.అలాగే భార్గవ్,గౌరవ్, యుగంధర్, మేఘన, మోక్షిత, యామిని, చక్రీ, నిహారిక, ప్రతీక్ ,పూజిత, భాషిణీలను అభినందించి నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐ ఎవీ లీలారావు, ఆర్ఐ గోపాలనాయుడు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్య తీసుకోవాలి

విజయనగరం దాసన్నపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వేంకటేశ్వరస్వామి ఆలయ దుర్ఘటనలో బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని భారతనాస్తిక సమాజం ఉమ్మడివిజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి బంకురు జోగినాయుడు ఒకప్రకటనలో డిమాండ్ చేశారు. కలెక్టరు నేతృత్వంలో విచారణ కమిటీ వేయడంపై హర్షం వ్యక్తం చేసినట్లు తెలిపారు.

వీడీఏ పాయింట్స్ పెంచాలి

రాజాం రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర వస్తువుల ధరలతో పాటు డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలు పెరుగుతుండడంతో వేరియబుల్ డియర్‌నెస్ అలవెన్స్ (వీడీఏ) పాయింట్స్ పెంచి కార్మికశాఖ వెంటనే గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని రాజాం జూట్‌మిల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడ రామ్మూర్తినాయుడు కోరారు. ఈ మేరకు మంగళవారం రాజాంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాట్లాడుతూ గతనెల 31న కార్మికశాఖ ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్‌లో ఒక్క వీడీఏ పాయింట్ కూడా పెంచలేదని తెలిపారు.

హనుమాన్ ఆలయంలో అన్నకూటి మహోత్సవం


అన్నకూటి మహోత్సవం నిర్వహించిన దృశ్యం

విజయనగరం రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓల్డ్ సిటీ బస్టాండ్‌లోఉన్న అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం అన్నకూటి మహోత్సవాన్ని నిర్వహించారు. ఏటా కార్తీక మాసంలో స్వామి వారికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగావస్తోంది. ఈ ఏడాది కూడా ఈ కార్యకమాన్ని ఆలయ అర్చకులు గాయత్రీ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. అంతకు ముందు స్వామి వారికి పంచామృతాభిషేకంచేశారు.అనంతరం తమలపాకులతో అభిషేకించారు. ఈ కార్యక్రమంలో నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

భోగాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ ప్రైవేటు జూనియర్ కాలేజీలో చదువుతున్న రామచంద్రపేటకు చెందిన నవదీప్ అండర్-17 జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రతినిధులు మంగళవారం తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో జరిగిన అండర్- 17 వాలీబాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రమ స్థానం సాదించి రాష్ట్ర ఉత్తమ సెట్టర్ అవార్డును అందుకున్నాడని చెప్పారు. ఈ మేరకు ఉత్తరప్రదేశ్‌లో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు..

గరివిడి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): శివరాం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈనెల 11నుంచి శ్రీకాకుళం జిల్లాలోని పాతపట్నంలో జరగనున్న రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. వాలీబాల్, నెట్‌బాల్, సాఫ్ట్‌టెన్నిస్ తదితర క్రీడల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు పాఠశాల విద్యార్థులు ఎంపిక కావడంపై హెచ్ఎం రమేష్, పీఈటీ పి.కృష్ణమూర్తి, సోషల్ టీచర్ ఎస్.రమేష్‌నాయుడు విద్యార్థులను అభినందించారు.

●భోగాపురం, నవంబరు4(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలోని మంత్రాలయంలో జరిగే రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ కబడ్డీ పోటీలకు రెల్లివలస ఉన్నతపాఠశాలకు చెందిన ఇజ్జరోత్ హరిణి, హర్షిత, నెట్‌బాల్‌కు కె.ప్రణతి ఎంపికయ్యారని హెచ్ఎంశంకరరావు తెలిపారు. ఈపోటీలు ఈనెల ఏడు నుంచి జరగనున్నాయని పేర్కొన్నారు.

క్రీడా సామగ్రి వితరణ

మెరకముడిదాం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొమ్మిది ఉన్నత పాఠశాలలు, ఏపీమోడల్ స్కూల్, కేజీబీవీ, చినబంటుపల్లి, ఇప్పలవలస ప్రాథమికోన్నత పాఠశాలలకు లక్షరూపాయలు విలువచేసే క్రీడా సామగ్రిని డెక్కన్ కెమికల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో హైదరాబాద్‌లోని బాలమిత్ర ఫౌండేషన్ ప్రతినిధులు అందజేశారు. కార్యక్రమంలో బిళ్లలవలస హెచ్ఎం వై.సుచరిత, ఉపాధ్యాయ సిబ్బంది, సీఆర్ఎంటీ రెడ్డి శంకర్ పాల్గొన్నారు.

డ్రగ్స్ మాఫియాకు మూలం జగన్: కళా

రాజాం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో డ్రగ్స్ మాఫియాకు వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మూలం అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కిమిడి కళావెంకటరావు విమర్శించారు. మంగళవారం రాజాంలో విలేకరులతో మాట్లాడుతూ ఐదేళ్లగా ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ హబ్‌గా మార్చింది ఎవరో జగన్ జవాబుచెప్పాలని కోరారు.మాదకద్రవ్యాల రాకెట్లలో వైసీపీ నాయకులు, అనుబంధ విద్యార్థి విభాగం నేతలు పట్టుబడుతున్నారని తెలిపారు. యువతను డ్రగ్స్‌కు బానిసలుగా మారుస్తున్న దారుణమైన దందా వెనుక వైసీపీ హస్తం స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో ఎక్కడ గంజాయి, డ్రగ్స్ ఆనవాళ్లు కనిపించినా అడ్డొస్తే తొక్కుకుని పోతామని, ఈ విషయంలో ఎవరిని ఉపేక్షించిది లేదని చెప్పారు. సమాజానికి ప్రమాదకరమైన మాఫియాను పెకిలించి వేస్తామని తెలిపారు.

డీపీఆర్‌ను ప్రభుత్వానికి నివేదిస్తా: అదితి

విజయనగరం రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి):మహారాజా పాలిటెక్నిక్ కళాశాలలో అధునాతన భవనాలను ఏర్పాటు చేసేందుకు డిటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)ని సిద్ధంచేయాలని, దీన్ని జిల్లా అధికారయంత్రాంగం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించనున్నట్లు విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు తెలిపారు. మంగళవారం విజయనగరంలోని మహారాజా పాలిటెక్నిక్ కళాశాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. కళాశాల అభివృద్ధి విషయమై ప్రిన్సిపాల్‌తో పాటు, కళాశాల అధ్యాపకులతో చర్చించారు.

పైడిమాంబ ఆలయం వద్ద అన్నదానం


అన్నదాన కార్యక్రమంలో వడ్డిస్తున్న అదితిగజపతిరాజు

విజయనగరం రూరల్/ కల్చరల్, నవంబరు 4: విజయనగరంలోని పైడిమాంబ సిరిమాను జాతర అనంతరం మంగళవారం మూడు లాంతర్ల వద్ద గల అమ్మవారి చదురుగుడి వద్ద భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, ఎమ్మెల్సీ గాదే శ్రీనివాసులనాయుడు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సతీమణి భక్తులకు అన్నప్రసాదం వడ్డించి ప్రారంభించారు. అమ్మవారి మహాప్రసాదాన్ని స్వీకరించేందుకు వేలాదిగా భక్తజనం తరలివచ్చారు. దేవదాయశాఖ సహాయ కమిషనర్ కె.శిరీష ఆధ్వర్యంలో ప్రధాన పూజారి బంటుపల్లి వెంకటరావు అమ్మవారి భక్తులు, సిబ్బంది, పట్టణ ప్రజల సంయుక్త ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. డీసీసీబీ నుంచి భారీ వాహనాలను ఆ రోడ్లలో అనుమతించలేదు. గంటస్తంభం నుంచి చదురుగుడి వైపు వచ్చే వాహనాలను కూడా ఆపేసి, ఆ రోడ్డులో సహపంక్తి భోజనాలు నిర్వహించారు. కొత్తపేట నీళ్లట్యాంకు నుంచి మూడులాంతర్లు వైపు వచ్చే వాహనాలను కూడా వేరే మార్గంలో మళ్లించారు. 10 వేల మంది భక్తులకు అన్నప్రసాదం అందించేలా ఏర్పాట్లు చేశారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

విజయనగరం దాసన్నపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలో నివాసముంటున్న పేదల కాలనీలో కనీస మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్‌చేశారు. మంగళవారం విజయనగరంలోని ఎల్‌బీజీనగర్, రామకృష్ణనగర్, వినాయకనగర్, గురజాడనగర్‌లో సమస్యలు పరిష్కరించాలని నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ నల్లనయ్యకి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం ప్రతినిధులు రమణమ్మ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి: డిప్యూటీ డీఈవో

నెల్లిమర్ల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి):విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని విజయనగరం డిప్యూటీ డీఈవో కె. వెంకటరమణకోరారు. మంగళవారం నెల్లిమర్ల నగరపంచాయతీలోని సోషల్ వెల్ఫేర్ స్కూల్, జడ్పీహెచ్ఎస్ జరజాపుపేట, ఆదిత్య పబ్లిక్, విశ్వంభ స్కూల్‌ను వెంకటరమణ పరిశీలించారు. సోషల్‌వెల్ఫేర్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనాలను పరిశీలించిన అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. కాగాజరజాపుపేట ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు శివుకు బంగారయ్య పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా గణిత దీప్తిపేరిట స్టడీ మెటీరియల్‌ను సమకూర్చిగా వెంకటరమణ అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కామేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మత సామరస్యంతో మెలగాలి: తహసీల్దార్

మెరకముడిదాం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి):గ్రామస్థులంతా మతసామరస్యాన్ని పాటించాలని, అందరూ కలిసిమెలసి మెలగాలని తహసీల్దార్ ఆకుల సులోచనరాణి సూచించారు.భైరిపురంలో గర్భాం రెవెన్యూపరిధిలో ఉన్న స్థలంలో ఇటీవల ఓ వర్గానికి చెందిన కొందరు సమావేశమందిరాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఆమందిరంలో రాత్రివేళల్లో అధిక శబ్దంవల్ల ఇబ్బందిపడుతున్నామని భైరిపురం, కొత్తవీధి గర్భాం గ్రామస్థులు కొంతమంది తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ ఆకుల సులోచనరాణి, వీఆర్వో, బుదరాయవలస ఎస్ఐ జె.లోకేష్‌కుమార్ గ్రామాన్ని సందర్శించి ఇరుపక్షాలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్ఐ లోకేష్‌కుమార్ మాట్లాడుతూ అధిక శబ్దాలతో మైక్‌సెట్లను వేయరాదని, మైక్‌సెట్‌లు వేసేందుకు అనుమతులు తప్పనిసరి అని తెలిపారు.

భూములు సాధించుకునే వరకు పోరాటం

ఎస్.కోట రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తమ భూములు సాధించుకునే వరకు పోరాటం ఆగదని జిందాల్ నిర్వాసితులు తెలిపారు. మంగళవారం బొడ్డవరలో 138వరోజు నిరసన దీక్షలో వారు మాట్లాడుతూ జిందాల్ యాజమాన్యం తమను బెదిరించడానికి పోలీసులను ఉపయోగిస్తోందని ఆరోపించారు.

తెల్ల పేపర్లపై సంతకాలు పెట్టించుకున్నారు

తమను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి గంటపాటు ఉంచి పూర్తి సమచారం సేకరించి తెల్లకాగితాలపై సంతకాలు పెట్టించారని జిందాల్ నిర్వాసిత మహిళలు వాపోయారు. మంగళవారం బొడ్డవరలో వారు విలేకరులతో మాట్లాడుతూ తమ ఇబ్బందులు చెప్పుకోవడానికి విజయనగరం కలెక్టర్ కార్యాలయానికి సోమవారం వెళ్లి తిరిగి వస్తున్నామని తెలిపారు.ఆ సమయంలో 13 మంది మహిళలను ఎస్.కోట పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి తమ కుటుంబ వివరాలు అడిగారని, మిమ్మల్ని వదలాలంటే తెల్లకాగితాలపై సంతకాలుచేయాలని పేర్కొనడంతో భయంతో పెట్టామని తెలిపారు. అయితే ఈ కాగితాల్లో ఏమి రాసి తమను ఇబ్బంది పెడతారో భయంగా ఉందని వాపోయారు. ఈవిషయంపై ఎస్పీకి ఫిర్యాదుచేస్తామని తెలిపారు.

ఇన్ఫోసిస్‌కు 143 మంది లెండి విద్యార్థినుల ఎంపిక


ఇన్ఫోసిస్‌కు ఎంపికైన లెండి కళాశాల విద్యార్థులు

డెంకాడ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉత్తరకోస్తాంధ్ర ప్రాంతంలో విద్యార్థినుల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన ఇన్ఫోసిస్ నియామక డ్రైవ్‌లో లెండి కళాశాలకు చెందిన 143 మంది ఎంపికయ్యారని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ హరిబాబు మంగళవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సంస్థ ఆధ్వర్యంలో ఇన్ఫోసిస్ సంస్థతో కలిసి ఈ డ్రైవ్‌ను అక్టోబరు 16 నుంచి 18 వరకు లెండి కళాశాలలో నిర్వహించారు. ఈ ఎంపికలకు మొత్తం 3,576మంది హాజరుకాగా1084 మంది ఇంటర్వ్యూలకు అర్హత సాధించగా, చివరకు 143 మంది విద్యార్థులు ఇన్ఫోసిస్‌కు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థినులకు రూ.3.6 లక్షల వార్షికవేతనంతో ఉద్యోగావకాశాలు సాధించారని హరిబాబు తెలిపారు. రాష్ట్రస్థాయి అవకాశాన్ని అందించడంలో ఏపీఐటీఏ డైరెక్టర్ ఎం.సత్యరత్నం కీలకపాత్ర పోషించారు. ఈ సందర్భంగా విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, డీన్(ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్) జి.ప్రకాష్‌బాబు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ టీమ్, విభాగాధిపతులు అభినందించారు.ఈసందర్భంగా ప్రిన్సిపాల్ రామారెడ్డి మాట్లాడుతూ నిరంతర శిక్షణ, మాక్ ఇంటర్వ్యూలు, కమ్యూనికేషన్ నైపుణ్యాభివృద్ధి వంటి కార్యక్రమాల వల్ల లెండి విద్యార్థుల విజయం సాధించారని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

గరివిడి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవాడ, కొండపాలెం, సేరీపేట, కొండదాడి, బీజేపాలెం,కుమరాం, గరివిడి తదితర గ్రామాలకు చెందిన తొమ్మిది మందికి రూ.8,39,207ల విలువచేసే ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బలరాం, సారిపాక సురేష్‌కుమార్, తుమ్మగంటి సూరినాయుడు పాల్గొన్నారు.

●దత్తిరాజేరు, నవంబరు 4:(ఆంధ్రజ్యోతి):తాడేంద్రవలసకు చెందిన టీడీపీ కార్యకర్త ఆవాల రాము ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆయన కుటుంబానికి రూ.ఐదు లక్షల బీమా చెక్కును మంగళవారం పార్టీ మండలాధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్ అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బోడసింగి సత్తిబాబు, సత్యారావు, సర్పంచ్ నారాయణప్పలనాయుడు,రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రజలకు వైద్య సేవలు అందించాలి

డెంకాడ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్యసేవలందించాలని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు కోరారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గ్రామాల్లో తాగునీటి వసతి కల్పన అధ్వానంగా ఉందని, ప్రజలకు వైద్య సేవలు అందట్లేదని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వాసుదేవరావు , వైస్ ఎంపీపీ తమ్మినాయుడు, ఎంపీడీవో భవాని, డీటీ శ్రీనివాసరావు, ఏవో టి.సంగీత, హెచ్‌వో ఝాన్సీ పాల్గొన్నారు.

వేతనాల కోసం పారిశుధ్య కార్మికుల నిరసన

రాజాం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తమకు మూడునెలలుగా వేతనాలు అందడం లేదని రాజాం ఏరియా ఆసుపత్రిలో పని చేస్తున్న సెక్యూరిటీ గార్డులు, పారిశుధ్య కార్మికులు వాపోయారు. ఈమేరకు మంగళవారం ఆసుపత్రి ఆవరణలో నిరసన తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలలకు సంబంధించిన వేతనాలు అందకపోవడంతో కుటుంబాలతో పస్తులు ఉండాల్సివస్తోందని వాపోయారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం

నెల్లిమర్ల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నాయకుడు ఇప్పిలి నీలకంఠం తెలిపారు. మంగళవారం నెల్లిమర్లలో బీజేపీ ప్రవాస్ యోజన సమావేశం పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు మైపాడ ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నెల్లిమర్ల నగర పంచాయతీ పదో వార్డు కౌన్సిలర్, టీడీపీ నాయకురాలు నరవ రామలక్ష్మి, కొండగుంపాం గ్రామానికి చెందిన నడుపూరు వెంకటరావు, పతివాడ లక్ష్మణరావు బీజేపీలో చేరారు.

●విజయనగరం దాసన్నపేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి):జిల్లాలో బీజేపీ బలోపేతానికి కృషిచేయాలని పార్టీ నాయకులు ఎంవీ అప్పారావు, లక్ష్మీనరసింహాలు పిలుపునిచ్చారు. మంగళవారం విజయనగరంలోని ఈస్టుమండలం బీజేపీ నాయకులు జమ్ము రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, భారత ప్రధాని నరేంద్రమోదీ స్వదేశీ నినాదంతో దేశాభివృద్ధికి ముందుకు వెళ్తున్నారన్నారు.

లింగాలవలసలో సర్వే అడ్డగింత

భోగాపురం, నవంబరు4(ఆంధ్రజ్యోతి):పోలిపల్లి రెవెన్యూ పరిధిలోగల లింగాలవలసలో మంగళవారం వీఎంఆర్‌డీఏ అధికారులు నిర్వహించిన సర్వేను రైతులు, స్థానికులు అడ్డుకున్నారు. మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా రహదారుల ఏర్పాటు కోసం వీఎంఆర్‌డీఏ అధికారులు, స్థానిక సర్వేసిబ్బంది సర్వే నిర్వహిస్తుండగా సమాచారం, నోటీసులు, లేకుండా ఏవిధంగా సర్వే నిర్వహిస్తారని అడ్డుకోవడంతో అధికారులు వెనుతిరిగారు.

రేగ సర్పంచ్ నీలకంఠం మృతి

లక్కవరపుకోట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగ సర్పంచ్ రావాడ నీలకంఠం (55)మృతిచెందారు.ఆయనకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య కుమారి రేగ ఫీల్డ్‌అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. క్వారీ నీలకంఠంగా నాలుగు మండలాలకు సుపరిచితుడు. ఆయన మృతిపట్ల పలువురు వైసీపీ, టీడీపీ నాయకులు సంతాపం తెలిపారు.

సీఐటీయూ మహాసభలను విజయవంతం చేయాలి

గజపతినగరం, నవంబరు4 (ఆంధ్రజ్యోతి):విశాఖపట్నంలో డిసెంబరు 31నుంచి జనవరి నాలుగో తేదీ వరకు జరగనున్న సీఐటీయూ 18వ అఖిలభారత మహాసభలను విజయవంతం చేయాలని మండల పంచాయతీ కార్మికుల సంఘం నాయకులు గోవింద, కృష్ణ కోరారు. మంగళవారం గజపతినగరం గ్రామ సచివాలయం ఆవరణలో మహాసభల పోస్టర్లు విడుదల చేశారు.కార్యక్రమంలో ఏసు, భాస్కరరావు పాల్గొన్నారు.

●దత్తిరాజేరు, నవంబరు 4:(ఆంధ్రజ్యోతి): దత్తిరాజేరులో సీఐటీయూ 18వ అఖిలభారత మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షురాలు వి.లక్ష్మి, నూకరాజు, జి.మూర్తి, సింహాచలం పాల్గొన్నారు.

మెంటాడను విజయనగరంలో కొనసాగించాలి

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మెంటాడ మండలాన్ని విజయనగరం డివిజన్‌లో కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని మెంటాడ కూటమి నాయకులు కోరారు. మంగళవారం కలెక్టరేట్ గాంధీ విగ్రహం వద్ద కూటమి నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించి డీఆర్వో శ్రీనివాసమూర్తికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలోని టీడీపీ నాయకులు గెద్ద అన్నవరం, రాయపల్లి రవి, గొర్లి ముసలి నాయుడు, జనసేన నాయకులు రాజశేఖర్, బీజేపీ నాయకులు ఎం.అప్పలనాయుడు పాల్గొన్నారు.


డీఆర్వోకి వినతిపత్రం అందజేసిన మెంటాడ కూటమి నాయకులు

పాడివానివాలసలో వృద్ధుడి హత్య

మెంటాడ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండలింగాలవలసపంచాయతీ పాడివానివాలసలో సోమవారంరాత్రి వృద్ధుడు హత్యకు గురయ్యాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. మెంటాడ మండలంలోని కూనేరు పంచాయతీ దిగువమిర్తివలసకు చెందిన పెదకాపు పైడితల్లి (65)భార్య కొన్నేళ్ల కిందట మృతిచెందింది. పక్కనే ఉన్న కొండలింగాలవలస పంచాయతీ పాడివానివలసకు చెందిన ఓ మహిళతో పైడితల్లికి 15 ఏళ్లుగా వివాహేతర సంబంధం ఉంది. అయితే అంతకుముందే ఆ మహిళ, ఆమె భర్త మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో భర్త వదిలేయడంతో ఆమె ఒంటరిగా ఉంటోంది. ఆతర్వాత ఆ మహిళకు పైడితల్లితో వివాహేతసంబంధం ఏర్పడింది. పైడితల్లి ఆమె ఇంటికి రాకపోకల వల్ల ఆ మహిళ కుమారులు మందలించేవారు. అయినా పైడితల్లిలో మార్పురాలేదు. ఈనేపథ్యంలో పైడితల్లి, మహిళ కుమారుల మధ్య గొడవలు జరిగేవి. సోమవారం రాత్రి ఆ మహిళతో కుమారుడు గొడవకు దిగాడు. అక్కడే ఉన్న పైడితల్లి స్వగ్రామమైన దిగువ మిర్తివలస వెళ్లేందుకు బయలుదేరాడు. కోపోద్రిక్తుడైన ఆ మహిళ కుమారుడు దుడ్డు కర్రతో తలపై బలంగా మోదడంతో పైడితల్లి కింద పడిపోయాడు. కొనఊపిరితో ఉన్న పైడితల్లిని ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. అప్పటికే మృతిచెందడంతో మృతదేహాన్ని అక్కడే ఉంచారు. సోమవారంరాత్రి ఘటన జరగ్గా ఫిర్యాదు చేసేందుకు గిరిజనులు, కుటుంబ సభ్యులు ముందుకురాలేదు. పైడితల్లి బంధువులు లోతు గెడ్డ సర్పంచ్‌కు మంగళవారం జరిగిన విషయం తెలియజేశారు. సర్పంచ్ భీమారావు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లినా ఫిర్యాదు చేయలేదు. చివరకు పైడితల్లి కుమార్తె చిన్నమ్మ ఫిర్యాదు మేరకు ఆండ్ర ఎస్ఐ సీతారాం కేసు నమోదు చేశారు. బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి, గజపతినగరం సీఐ రమణ, ఏఎస్ఐ ఐవీ రమణ, క్లూస్ టీమ్ సభ్యులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వట్టిగెడ్డలో గల్లంతై.. వేగావతిలో విగతజీవిగా..

- మోసూరుకు చెందిన వృద్ధుడి మృతదేహం లభ్యం

సాలూరు రూరల్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): మోసూరుకు చెందిన వృద్ధుడు పాంచాళికి పనిపై వెళ్లి వస్తూ వట్టిగెడ్డలో కొట్టుకుపోయి సాలూరు మండలంలోని శివరాంపురం వద్ద మంగళవారం విగతజీవిగా కనిపించాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పాచిపెంట మండలం మోసూరుకు చెందిన గండిపిల్లి పెదరాములు (80) సోమవారం సాయంత్రం పనిపై పాంచాళి గ్రామానికి వెళ్లాడు.ఆయన సాయంత్రం 7గంటల సమయంలో మోసూరు,పాంచాళి మధ్య ఉన్న వట్టిగెడ్డను దాటే యత్నించాడు. అయితే వరద దాటికి ఆయన కొట్టుకుపోయాడు. ఈ విషయం తెలియని భార్య చిన్న రాత్రి 10 గంటల వరకు గాలించారు. ఆచూకీ తెలియకపోవడంతో మంగళవారం ఉదయం పాచిపెంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు పోలీసులు ఆయన ఆచూకీ కోసం గాలించారు. వట్టిగెడ్డ నది సాలూరు మండలం పరిధిలో వేగావతిలోనదిలో కలుస్తుంది. ఈనేపథ్యంలో వేగావతిలో సైతం గాలింపు చేపట్టగా శివరాంపురం వద్ద ఆయన మృతదేహం లభ్యమైంది. ఈ ఘటనపై సాలూరు రూరల్ ఎస్ఐ నరసింహామూర్తి కేసు నమోదు చేశారు. మృతుడికి కుమార్తె మల్లీశ్వరి ఉంది.

16 మందిపై బైండోవర్ కేసులు

బొండపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి):మండలంలో పలు కేసుల్లో పట్టుబడిన 16 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ జనార్దనరావు తెలిపారు.ఇదివరకే పలు కేసుల్లో పట్టుబడిన 14 మందితో పాటు బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నటు అనుమానం ఉన్న ఇద్దరిపై తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు సమక్షంలో హాజరుపరిచి ఏడాదికి రూ. రెండు లక్షలకు బాండ్లను సమర్పించి బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.కార్యక్రమంలో ఎస్ఐలు పి.నరేంద్రకుమార్, పి.శాంతిలక్ష్మి, హెచ్‌సీ ఎండీజే భాషా, కానిస్టేబుల్ వి.అప్పారావు పాల్గొన్నారు.

10 మందిపై పాత నేరస్థులపై..

కొత్తవలస, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గతంలో బెల్ట్ షాపులు నిర్వహించి వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న పది మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు కొత్తవలస ఎక్సైజ్ సీఐ జీఎస్ రాజశేఖర నాయుడు తెలిపారు. ఈ మేరకు పదిమంది పాత నేరస్థులను కొత్తవలస మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్రేట్ పి.అప్పలరాజు ఎదుట హాజరుపరిచారు. ఏడాది పాటు ఎటువంటి నేరాలు చేయబోమని నిందితులతో బాండ్లపై సంతకాలు చేయించుకున్నారు.

కేవీపురంలో చెరకు తోటలు దగ్ధం

రేగిడి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమిర వెంకటాపురంలో మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో ఇద్దరు రైతులకు చెందిన 2.39 ఎకరాల చెరకు తోటలు దగ్ధమయ్యాయి. రెవెన్యూ అధికారుల మేరకు..పంట పొలాల్లో విద్యుత్ స్తంభాల నుంచి వైర్లు తెగిపడడంతో షార్ట్‌సర్క్యూట్ జరిగింది. దీంతో కింజరాపు భాస్కరావుకు చెందిన రెండెకరాలు, బట్న లక్ష్మణకు చెందిన 0.39 సెంట్లు విస్తీర్ణంలో చెరకు తోటలు పూర్తిగా కాలిపోయింది. ఈమేరకు లక్షరూపాయలు పంట నష్టం జరిగి ఉంటుందని అంచనావేశారు.వరిపంట పొలాల మధ్యలో చెరకు తోటలు ఉండడంతో మంటలు ఆపేందుకు రైతులకు వీలుపడలేదు. మరో రెండు నెలల్లో చెరకుతోటలు కోతకు వచ్చే సమయంలో ప్రమాదం జరగడంతో రైతులు కన్నీరుమున్నీరయ్యారు. షార్ట్‌సర్క్యూట్ జరిగిన సమయంలో రైతులు అటువైపు వెళ్లకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఇంతలో సిబ్బంది విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో గ్రామస్థులు ఊపిరిపీల్చుకొన్నారు. ఆర్ఐ గిరి, ఖండ్యాం, కొమరి వీఆర్వోలు భవాని, మెఖలింగంలు కాలిపోయిన చెరకుతోటలను సందర్శించారు. పంటనష్టం అంచానవేసి తహసీల్దార్ కార్యాలయానికి సమాచారం అందించారు.

నైటీకి నిప్పంటుకుని మహిళకు గాయాలు

రాజాం రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని వాసవినగర్‌లో ఓఇంట్లో జరిగిన అగ్నిప్రమాదంలో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి.రాజాంటౌన్ సీఐ కె.అశోక్‌కుమార్‌కథనం మేరకు.. పట్టణంలోని వాసవినగర్‌లో నివాసముంటున్న టంకాల రేవతమ్మ మంగళవారం వంటచేస్తుండగా నైటీకి నిప్పంటుకుంది.శరీరంపై మంటలు వ్యాపించడంతో కేకలువేస్తూ బాత్‌రూములోకి వెళ్లి నీటిని శరీరంపై వేసి మంటలు ఆర్పే ప్రయత్నం చేసింది. కేకలు విన్నచుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని కాపాడే ప్రయత్నంచేశారు. విషయం తెలుసుకున్న రేవతమ్మ భర్త బొద్దూరునుంచి ఇంటికి చేరుకుని రాజాం ఏరియాఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. రేవతమ్మ నుంచి సీఐ వాంగ్మూలం తీసుకుని కేసు నమోదు చేశారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరికి..

సంతకవిటి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సంతకవిటి - మందరాడ రహదారిలో ఓ గ్యాస్‌కంపెనీ సమీపంలోగల రహదారి పక్కన కూర్చొన్న యువకుడిని గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, కుటుంబసభ్యుల కథనం మేరకు.. మందరాడ రహదారిలోని చెరువు దగ్గర మంగళవారం ఉదయం గుర్రాల అచ్చుతరావు కాలకృత్యాలు తీర్చుకొని కూర్చొని ఉన్నాడు.ఇంతలో సంతకవిటి నుంచి మందరాడ వైపు వెళ్తున్న ఒక ద్విచక్రవాహనం ఆయన్ను ఢీకొట్టింది. దీంతో అచ్చుతరావును స్థానికులు రాజాం ఏరియాఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంతకవిటి బస్టాండ్ పరిధిలోఉన్న సీసీ ఫుటేజ్‌లను ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు పరిశీలిస్తున్నారు.

ఆలయాలపై దృష్టి సారించాలి: సీఐ

భోగాపురం, నవంబరు4(ఆంధ్రజ్యోతి):కార్తీకపౌర్ణమి పురస్కరించుకుని భక్తుల తాకిడి ఎక్కువగా ఉండే దృష్ట్యా ఆలయాలపై దృష్టి సారించాలని సీఐ కె.దుర్గాప్రసాదురావు సూచించారు.మంగళవారం స్థానిక పోలీ స్టేషన్‌లో సచివాలయ మహిళాపోలీసులతో సమావేశం నిర్వహించారు.

పౌర్ణమి రోజు రద్దీ లేకుండా చర్యలు

లక్కవరపుకోట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని ఆలయాల వద్ద రద్దీలేకుండా ముందస్తు చర్యలకు పోలీసులు ఉపక్రమించారు. ఎస్ఐ నవీన్‌పడాల్ ఆధ్వర్యంలో ప్రధాన ఆలయాల వద్ద భక్తులు క్యూలో ఉండి దర్శనం చేసుకునేలా ఆలయ ధర్మకర్త, కమిటీలు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ మేరకు ఎల్.కోట శివాలయం, గొల్జాంలోని సాయిబాబా ఆలయం, రేగ గాయత్రిమాత ఆలయం, శ్రీగృహ లింగేశ్వరస్వామి ఆలయం తనిఖీ చేశారు. బుధ, గురువారాల్లో ఆలయాల వద్ద భద్రత కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

టెట్‌పై అయోమయం

(ఐదో పేజీ తరువాయి)

గణితం 20, భౌతిక, రసాయనశాస్త్రాల (సైన్స్) నుంచి 20 చొప్పున మార్కులు ఉంటాయి. ఉపాధ్యాయులకు వారి సబ్జెక్టుకు సంబంధించి మరో 20 మార్కులు ఉంటాయి. అయితే స్కూల్ అసిస్టెంట్లు 6 నుంచి 10 తరగతుల వరకు ఒకే సబ్జెక్టు బోధిస్తారు. కాబట్టి మిగిలిన సబ్జెక్టులపై ప్రత్యేక తర్ఫీదు అవసరం. లేకుంటే టెట్ పాసవ్వడం కష్టం. ఇన్ సర్వీసులో ఉన్న టీచర్లకు అకడమిక్ అర్హత మార్కుల్లో సడలింపు ఇచ్చారు కానీ టెట్ అర్హత మార్కుల్లో సడలింపు ఇవ్వలేదు. ఉపాధ్యాయ విద్య ప్రమాణాల నియంత్రణ, పర్యవేక్షణ సంస్థ నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ) నిబంధనల ప్రకారం ఓసీలకు 60 శాతం, బీసీలకు 50 శాతం, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, మాజీ సైనిక ఉద్యోగుల పిల్లల్లో ఇన్ సర్వీసు టీచర్లు 40 శాతం మార్కులతో పాసవ్వాల్సిందే. టెట్ కోసం దరఖాస్తు చేసేందుకు తుది గడువు ఈనెల 23గా నిర్ణయించింది.

● టెట్‌పై ఉపాధ్యాయ సంఘాలన్నీ భగ్గుమంటున్నాయి. ఇప్పటికే వీరు తమ నిర్ణయాన్ని సర్కారు దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో ప్రభుత్వం స్పందించి సర్వోన్నత న్యాయస్థానంలో రివ్యూ పిటీషన్ వేసేందు కు సిద్ధపడింది. అయితే గడువు సమీపిస్తున్న తరుణంలో కొందరు ఇన్ సర్వీసు ఉపాధ్యాయులు టెట్‌కు దరఖాస్తు చేసుకుంటున్నట్లు విద్యా శాఖ చెబుతోంది. మిగిలిన వారు కూడా దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. రివ్యూ పిటీషన్ వేసినా పెద్దగా తీర్పులో మార్పు ఉండదని కొందరు టీచర్లు చెబుతున్నారు. పార్లమెంటులో మళ్లీ విద్యా హక్కు చట్టంపై చర్చ జరిగి.. సవరణ చేస్తేనే ప్రయోజనం ఉంటుందంటున్నారు.

మినహాయింపు ఇవ్వాలి..

ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులు టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించాలని షరతు విధించడంపై పునరాలోచన చేయాలి. టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి. నోటిఫికేషన్ సమయంలో టెట్ ప్రక్రియ లేదు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. కోర్టు పునః పరిశీలన చేయాలి.

-డి.ఈశ్వరరావు, ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించాం..

సర్వీసులో దశాబ్దాల తరబడి కొనసాగుతున్న ఉపాధ్యాయులు టెట్ అర్హత ఉండాలన్న విషయంపై రాష్ట్ర ప్రభుత్వానికి సంఘం పరంగా విన్నవించాం. టెట్ నుంచి ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటీషన్ వేయాలి.

-డి.రాము, యూటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కమిటి సభ్యుడు

కలకలం

(ఐదో పేజీ తరువాయి)

వైసీపీ నేత మాట్లాడుతూ తాను 2023 నుంచి ఢిల్లీ, గుజరాత్, ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల నుంచి వీటిని తెప్పించి రైతులకు అరువు ఇస్తున్నానని, వీటికి లైసెన్స్ ఉండాలని తెలియదని చెప్పడం గమనార్హం.

'మీడియాకు అలా చెప్పొద్దు'..

అధికారులు పూర్తిగా వివరాలు రాసుకున్నాక ఆ వైసీపీ నేత అధికారులతో వాదనకు దిగారు. స్వాధీనం చేసుకున్న సరుకు విలువ రూ.55లక్షలు చెబుతున్నారని, విలేకర్లకు అలా చెప్పడానికి వీలులేదని పట్టుపట్టారు. ఆయన వర్గీయులు కూడా అలాగే చేయాలని అధికారులపై ఒత్తిడి తెచ్చారు. కాగా పురుగుమందులు నిల్వచేసే గోదాంకు పంచాయతీ అనుమతులు కూడా లేవని స్థానికులు తెలిపారు. ఇదే విషయంపై పంచాయతీ కార్యదర్శి ఎర్నమ్మను వివరణ కోరగా ఈ భవనానికి ఎటువంటిపన్నులు కట్టడం లేదని స్పష్టంచేశారు.

ఉత్తరాంధ్రకే కేంద్ర బిందువు

(ఐదో పేజీ తరువాయి)

పూర్తి చేసేందుకు కృతనిశ్చయంతో పని చేస్తున్నామన్నారు. ఎయిర్‌పోర్టును వచ్చేఏడాది జూన్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీతో ప్రారంభించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచిస్తున్నారని చెప్పారు. ఈఏడాది డిసెంబరు చివరిలో లేదా వచ్చే ఏడాది జనవరి మొదట్లో ఎయిర్‌పోర్టులో విమానం ట్రయల్ రన్ జరుగుతుందన్నారు. ఈ ప్రాంతంలో ఐదు స్టార్ హోటల్స్ కూడా వస్తున్నాయని, స్థానికుల టాలెంట్‌కు తగ్గ ఉపాధి దొరుకుతుందన్నారు. తద్వారా వలసలు తగ్గే అవకాశం ఉందన్నారు. ఎయిర్‌పోర్టులో టాక్సీవే, రన్‌వేల పనులు నాణ్యతతో జరుగుతున్నాయని, నావిగేషన్, ట్రాఫిక్‌కంట్రోల్ పరంగా ఏవియేషన్ మినిస్ట్రీ నుంచి చేయాల్సినవన్నీ చేస్తామన్నారు. విశాఖపట్నం ఎయిర్‌పోర్టులో కన్నా ఇక్కడ ఎక్కువగా విమానాలు రాకపోకలు సాగించే విధంగా సన్నాహాలు చేస్తామని, ఇప్పటికే కొన్ని ఎయిర్‌లైన్స్‌ను సంప్రదించామని చెప్పారు. ఎయిర్‌పోర్టు గ్లోబల్ స్టాండర్డ్స్‌తో నిర్మిస్తున్నామని, ఈనెలలో విశాఖలో నిర్వహించబోయే పారిశ్రామిక సదస్సులో ఏవియేషన్‌కు సంబంధించిన పరిశ్రమలను ఆహ్వానిస్తున్నామన్నారు. అప్పటి కేంద్రమంత్రి అశోక్‌గజపతిరాజు పునాది వేసిన విమానాశ్రయం చివరిదశకు రావడం చాలా ఆనందాన్ని ఇస్తోందన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టుతో ఈప్రాంతం రూపురేఖలు మారిపోతాయని, అభివృద్ధి పరుగులు తీస్తుందన్నారు. అనంతరం ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సంబంధించి జీఎంఆర్, ఎల్‌అండ్‌టీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల నుంచి ఎయిర్‌పోర్టుకు వేగంగా చేరుకొనేందుకు అవసరమైన కొత్త రహదారుల నిర్మాణం, ట్రంపెట్ బ్రిడ్జి తదితరవాటిపై అధికారులతో చర్చించారు. ఆయన వెంట ఎంపీ కలిశెట్టిఅప్పలనాయుడు, ఎమ్మెల్యే లోకంనాగమాధవి, కలెక్టర్ రామ సుందర్‌రెడ్డి, ఎస్పీ దామోదర్, ఆర్డీవో డి.కీర్తి తదితరులు ఉన్నారు.

కార్యాలయాన్ని ఖాళీ చేయండి

● సోషల్ వెల్ఫేర్ డీడీ అన్నపూర్ణమ్మ
● కళాశాల హాస్టల్ నిర్వహణపై ఆగ్రహం

బొబ్బిలి, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కార్యాలయం శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో ఆ భవనాన్ని తక్షణం ఖాళీ చేయాలని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అన్నపూర్ణమ్మ అధికారులను ఆదేశించారు. కూలడానికి సిద్ధంగా ఉన్న ఏఎస్‌డబ్ల్యూవో కార్యాలయం భవనంపై 'శ్లాబులు పెచ్చులూడి పోయి.. గదులు కారిపోయి' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. దాంతో ఆమె మంగళవారం బొబ్బిలి కి చేరుకుని ఏఎస్‌డబ్ల్యూవో టి.సత్యనారాయణతో మాట్లాడారు. ఈ భవనాన్ని ఖాళీ చేసి వేరే భవనంలోనికి మార్పు చేసి తనకు నివేదిక అందజేయాలన్నారు.

అనంతరం స్థానిక కళాశాల బాలుర హాస్టల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మె ఆగ్రహం వ్యక్తం చేశారు. వంద మంది విద్యార్థులు ఉన్న ఈ హాస్టల్‌లో కనీస సదుపాయాలు కల్పించకపోవడంతో ఆమె... ఏఎస్‌డబ్ల్యూవో, వార్డెన్, ఇతర సిబ్బందిపై మండిపడ్డారు. మరుగుదొడ్లు అధ్వానంగా ఉండటం, డ్రైనేజీల నుంచి దుర్గంధం వెదజల్లుతుండటం, విద్యుత్ సమస్యలపై అధికారులను ఆమె నిలదీశారు. ముగ్గురు సిబ్బంది ఉన్నప్పటికీ పరిసరాలన్నీ దారుణంగా ఉంచడం ఏమిటని ప్రశ్నించారు. హాస్టల్ మొత్తం శుభ్రం చేసి ఆహ్లాదకరంగా తయారు చేయాలని ఆదేశించారు. లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హాస్టళ్ల నిర్వహణపై నిర్లక్ష్యం చూపితే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.



హాస్టల్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డిప్యూటీ డైరెక్టర్

కూటమితో కొప్పల వెలమలకు ప్రాధాన్యం

బాడంగి, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తొలి నుంచి కొప్పలవెలమకు గర్తింపు, ప్రాధాన్యత ఇచ్చింది తెలుగుదేశం పార్టీ అని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా అండగా ఉంటుందని కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లి అప్పలనాయుడు అన్నారు. విజయవాడ బీసీ భవన్‌లో మంగళవారం ఉదయం రాష్ట్ర మంత్రి ఎస్.సవిత ఆధ్వర్యంలో ఆదరణ-3 అమలుపై కొప్పలవెలమ కార్పొరేషన్ ఛైర్మన్, డైరెక్టర్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కొప్పలవెలమ కార్పొరేషన్ ఛైర్మన్ పి.వి.జి.కుమార్, డైరెక్టర్ కొల్లి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు. ఆదరణ-3 అమలుకు రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి కోట్ల రూపాయలు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. అలాగే మంత్రి దృష్టికి పలు అంశాలను తీసుకువెళ్లారు. అందుకు మంత్రి సవిత సానుకూలంగా స్పందించి అమలు చేస్తామని హామీ ఇచ్చారని అప్పలనాయుడు తెలిపారు.



రాష్ట్ర మంత్రి సవితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అప్పలనాయుడు

పారిశుధ్యం మెరుగుపర్చండి

రామభద్రపురం, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో పారిశుద్యం మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకోవాలని డీడీవో ఎం.కిరణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కొండకెంగువ, ఇట్లామామిడిపల్లి గ్రామాల్లో అతిసారం సోకిందని 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కావడంతో ఆయన మంగళవారం కొండకెంగువ, ఇట్లామామిడిపల్లి గ్రామాల్లో పర్యటించారు. కాలువల్లో పూడికతీత పనులు పెద్ద ఎత్తున చేపట్టి బ్లీచింగ్ చల్లాలని సూచించారు. ప్రజలు కూడా పారిశుధ్యంపై అవగాహన కల్పించాలన్నారు. చెత్త నుంచి సంపద ఎలా సృష్టించాలి అనే దానిపై సచివాలయ ఉద్యోగులకు సూచనలిచ్చారు. అనంతరం ఎస్‌డబ్ల్యూపీసీ పనితీరును పర్యవేక్షించారు. ఇదిలా ఉండగా ఆరికతోట పీహెచ్‌సీ వైద్యాధికారి అపర్ణ ఉచిత వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఇట్లామామిడిపల్లిలో పర్యటిస్తున్న డీడీవో

వార్డుల వారీ సమస్యలపై సమీక్ష

బొబ్బిలి, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని 31 వార్డులలో నెలకొన్న పలు సమస్యలు, వాటి పరిష్కారానికి సంబంధించి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి వార్డు ఇన్‌చార్జిలతో సమీక్ష నిర్వహించారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వార్డు పార్టీ ఇన్‌చార్జిలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం పార్టీ యంత్రాంగం సర్వసన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. వార్డుల్లో అన్ని సమస్యలపై అవగాహన పెంచుకొని వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. అన్ని వర్గాల ప్రజలతో మమేకం కావాలన్నారు. పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాష్ట్రాభివృద్ధి కోసం చేస్తున్న కృషిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వారంలో రెండు రోజుల పాటు వార్డు సమస్యలకు సంబంధించి అంకితభావంతో పనిచేయాలని, ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వాలని పార్టీ శ్రేణులకు సూచించారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు పెద్దింటి మనోజ్ కుమార్, ఏఎంసీ డైరెక్టర్ లంక రమేష్, వార్డు ఇన్‌చార్జిలు చిక్కాల సందీప్, కొట్టేడ సురేష్, సంచాన గంగాధర్, పళ్లెం రాజా, సాయిశంకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనసేన ఇన్‌చార్జి గిరడ

గ్రామాల్లో సంపద సృష్టించండి

బొబ్బిలి రూరల్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): చెత్త సంపద కేంద్రాల ద్వారా పంచాయతీల్లో సంపద సృష్టించాలని జడ్పీ సీఈవో సత్యనారాయణ అన్నారు. మంగళవారం గొర్లెసీతారాంపురంలోని చెత్త సంపద కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకు వచ్చి చెత్త ద్వారా సంపద సృష్టించాలన్నారు. అలాగే గ్రామీణ ప్రాంత ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మండలంలోని ఎన్ని చెత్త సంపద కేంద్రాలు ఉన్నాయి? ఎన్ని వినియోగంలో ఉన్నాయని ఎంపీడీవో రవికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామాల్లో వాటర్ ట్యాంక్‌ల క్లీనింగ్, క్లోరినేషన్ ప్రకియను పరిశీలించారు. క్లోరినేషన్ చేసిన నీటిని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి, ఇంజనీరింగ్ సహాయకుడు, సచివాలయ సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.



గొర్లెసీతారాంపురంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో

ధాన్యం సేకరణకు సిద్ధంగా ఉండాలి

(ఐదో పేజీ తరువాయి)

వర్గీకరించామని చెప్పారు. ప్రతి రైతుసేవా కేంద్రంలో ధాన్యం సేకరణకు అవసరమైన సామగ్రిని సిద్ధం చేయాలన్నారు. జిల్లాకు కోటి గోనె సంచులు అవసరం అవుతాయని, 50 లక్షల వరకూ అందుబాటులో ఉన్నాయని, మిగిలిన వాటిని సేకరించాల్సి ఉంటుందని అన్నారు. రెండు వేల వాహనాలు సిద్ధం చేస్తున్నామని, ఈ వాహనాలన్నింటికీ జీపీఎస్ ఉంటుందన్నారు. 159 మిల్లులను గుర్తించామని, వాటి సామర్థ్యం ప్రకారం ధాన్యం సిద్ధం చేయాల్సి ఉంటుందని వివరించారు. ఈ ఏడాది ఆర్‌ఎస్‌కేలలో ఉండే తేమ యంత్రాలనే మిల్లుల వద్ద కూడా ఏర్పాటు చేస్తామన్నారు. నవంబరు 2వ వారం నుంచి సేకరణ కేంద్రాలు ప్రారంభమవుతాయని, విజిలెన్స్ బృందాలతో రాష్ట్ర సరిహద్దుల వద్ద, చెక్ పోస్టుల వద్ద నిఘా ఏర్పాటు చేయాలని ఆర్‌డీవోలకు సూచించారు. గ్రామాల్లో ప్రతి రైతుకు ధాన్యం సేకరణపై అవగాహన కల్పించాలన్నారు. సాంకేతిక సిబ్బంది యాప్స్, పోర్టల్స్, ఎన్‌ఓపీ లాగిన్‌లపై అవగాహన పెంచుకుని సమర్థంగా పని చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. చెల్లింపులు 48 గంటలల్లోనే పూర్తయ్యేలా చూడాలన్నారు. జిల్లాలో స్థాయిలో 89789 75284 నంబర్‌తో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, మండల స్థాయిలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. 1967 టోల్ ఫ్రీ నెంబరు ఏర్పాటు చేశామని, ఏ ఒక్క రైతుకు నష్టం జరకుండా సేకరణ చేయాలని తెలిపారు. శిక్షణలో పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజరు బి.శాంతి, ఆర్‌డీవోలు కీర్తి, రామ్మోహన్, సత్యవాణి, జిల్లా పౌర సరఫరాల అధికారి మురళీధర్, డీసీవో రమేష్, జిల్లా వ్యవసాయ అధికారి తారకరామారావు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయండి

బొబ్బిలి, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభాపాటవాలను వెలికితీయడానికి పలురకాల పోటీలు దోహదపడతాయని గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ రౌతు రామమూర్తి అన్నారు. జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు పోల సత్యంనాయుడు ఆధ్వర్యంలో స్థానిక ట్రిపుల్ ఎస్ డిగ్రీ కళాశాలలో మంగళవారం మండల స్థాయి చెకుముకి టాలెంట్ పరీక్ష నిర్వహించారు. అందులో విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామమూర్తి మాట్లాడుతూ విద్యార్థులలో శాస్త్రీయదృక్పథాన్ని పొంపొందించడంతో పాటు వారిలో ఆరోగ్యకరమైన పోటీతత్వాన్ని వృద్ధి చేసేందుకు టాలెంట్ టెస్టులు దోహదపడతాయన్నారు. ఈ పరీక్షలో 25 బృందాల నుంచి 90 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో నాలుగు బృందాలను జిల్లా స్థాయి విజేతలుగా నిలిచారు. పిరిడి జడ్పీ ఉన్నత పాఠశాల, మహాత్మాజ్యోతిబా పూలే పాఠశాల, బొబ్బిలి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, అభ్యుదయ హైస్కూల్ ఎంపికయ్యాయి. వారందరికీ కళింగవైశ్య అధ్యక్షుడు సౌజన్యంతో బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా గౌరవ అధ్యక్షుడు, రిటైర్డ్ ఇంజనీరింగ్ అధికారి శివానంద్, శంబంగి శ్రీనివాస్, పిల్లా సత్యనారాయణ, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు రెడ్డి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న రామమూర్తి

పీఏసీఎస్ ద్వారా రూ.25 లక్షల రుణాలు

రామభద్రపురం, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ పరపతి సంఘం నుంచి రైతులకు అడిషనల్ ఫైనాన్స్ కింద రూ.25 లక్షల రుణాలు అందించనున్నామని చైర్‌పర్సన్ చొక్కాపు విజయలక్ష్మి తెలిపారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆమె విలేఖర్లతో మాట్లాడారు. వన్‌బీ, ఆధార్ తీసుకు వచ్చిన రైతులకు ఎకరాకు రూ.70వేల చొప్పున ఈ రుణాలు మంజూరు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు. డీసీసీబీ ఛైర్మన్ కిమిడి నాగార్జున సహకారంతో ఈ నిధులు విడుదలయ్యాయన్నారు. అలాగే ఈ ఏడాది రూ.కోటి 9 లక్షల రుణాలను రెన్యువల్ చేశామన్నారు. సుమారు రూ.80 లక్షల డిపాజిట్లు కూడా సేకరించామన్నారు. సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకుడు చొక్కాపు రామారావు కూడా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ విజయలక్ష్మి

నేడు జ్వాలా తోరణం

రామభద్రపురం, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గిరిజా రామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం కార్తీక పౌర్ణమి పర్వదినం పురస్కరించుకుని జ్వాలా తోరణం మహోత్సవం నిర్వహిస్తున్నట్టు సమరసతా సేవా ఫౌండేషన్ కన్వీనర్ బాదంపూడి నాగ రామలింగేశ్వర శర్మ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆలయంలో రాత్రి 8 గంటలకు కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఆయనతో పాటు శ్రీకాంత్ శర్మ ఉన్నారు.

రెండు లారీలు ఢీ: తప్పిన పెను ప్రమాదం

రామభద్రపురం, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డు వద్ద మంగళవారం రెండు లారీలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కావడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఒడిశా నుంచి వస్తున్న ఆయిల్ ట్యాంకర్‌ను సాలూరు వెళుతున్న లారీ ఎదురెదురుగా ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. దాంతో కొద్ది సమయం ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

అక్రమంగా కంకర తరలింపు: ట్రాక్టర్ల స్వాధీనం

సీతానగరం, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): నిడగళ్లు రెవెన్యూ పరిధిలో అక్రమంగా కంకర తవ్వకాలు జరుగుతున్నాయని మైనింగ్ ఏడీ శ్రీనివాసరావు కు సమాచారం అందడంతో సోమవారం రాత్రి దాడులు నిర్వహించారు. ఎటు వంటి అనుమతులు లేకుండా కంకర తవ్వకాలు జరుగుతున్నాయని అధికా రులు గుర్తించారు. ఆ సమయంలో అక్కడ ఉన్న ఐదు ట్రాక్టర్లు, ఒక ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకుని సీతానగరం పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. కంకర తవ్వకాలను గుర్తించి ఎంత తరలించారన్నది అంచనా వేసి అపరాధ రుసుం విధించనున్నట్లు ఏడీ శ్రీనివాసరావు తెలిపారు.

ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం సస్పెన్షన్

సీతంపేట రూరల్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధిలోని బందపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం వై.సుజాతను సస్పెండ్ చేసినట్టు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. హెచ్‌ఎం సుజాతపై పలు ఆరోపణలు రావడంతో మొదటిగా చార్జీ మెమో జారీ చేశామన్నారు. అనంతరం సదరు ఉపాధ్యాయురాలు ఇచ్చిన వివరణ సంతృప్తిగా లేని కారణంగా తదుపరి చర్యల్లో భాగంగా ఆమెను సస్పెండ్ చేశామని పేర్కొన్నారు. దీనిపై తదుపరి విచారణ నిమిత్తం విచారణాధికారిగా టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తిని నియమించినట్లు పీవో తెలిపారు. విచారణాధికారి సమర్పించిన నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయండి

రామభద్రపురం, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): మండలంలో బీజేపీ బలోపేతానికి గ్రామస్థాయిలో కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముగడ అనిల్ కోరారు. మండల కేంద్రంలో మంగళవారం మండల బీజేపీ అధ్యక్షురాలు మూడడ్ల ఆదిలక్ష్మి అధ్యక్షతన మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. జీఎస్టీ వల్ల కలిగే లబ్ధిని ప్రచారం చేయాలన్నారు. అలాగే మండల కమిటీలు, పోలింగ్ బూత్‌ల వర్గీకరణ, సభ్యత్వాలు తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా కార్యదర్శి అనిల్

ఆడిటోరియం నిర్మాణానికి స్థల పరిశీలన

పార్వతీపురం, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్వీడీ డిగ్రీ కళాశాలలో ఆడిటోరియం నిర్మాణానికి మంగళవారం కళాశాల ప్రాంగణంలో అనువైన స్థలాన్ని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్, మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు పరిశీలించారు. నూతనంగా నిర్మించ తలపెట్టిన ఆడిటోరియం బహుళ ప్రయోజనాలకు ఉపయోగపడేలా ఉండాలని నిర్ణయం చేశారు. పరిశీలనలో జేసీ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హేమలత ఉన్నారు.